ఘనంగా సంక్రాంతి పండుగ

గుంతకల్లుటౌన్: సంక్రాంతి పండుగను సోమవారం పట్టణ ప్రజలు ఘనంగా చేసుకున్నారు. మహిళలు ఇళ్ల ముంగిట ముత్యాల ముగ్గులను అందంగా తీర్చిదిద్దారు. పండుగ సందర్భంగా పట్టణంలోని వేంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి, పాతూరు పాతగుంతకల్లు రామలింగేశ్వరస్వామి, వినాయక స్వామి ఆలయాలకు భక్తులు వెళ్లి పూజలు నిర్వహించారు. అలాగే పాతగుంతకల్లులో రైతులు సంక్రాంతి సంబరంగా చేసుకున్నారు. మంగళవారం కనుమ సందర్భంగా పశువులకు రైతన్నలు పూజలు నిర్వహించారు.

కసాపురంలో గోపూజ

గుంతకల్లు రూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం గోపూజ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు గోవుకు నూతన వస్త్రాలు సమర్పించి ఆశీర్వచనాలను పొందారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో సోమవారం, మంగళవారం ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు చూడముచ్చటగా రంగు వల్లులు కనిపించాయి. అలాగే సోమవారం రాత్రి కోటలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం వద్ద నుంచి ప్రత్యేకంగా అలకంరించిన వాహనంలో స్వామి ఉత్సవ విగ్రహాలు ఉంచి గ్రామోత్సవం చేపట్టారు. లక్ష్మి నరసింహ స్వామి మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.


యాడికి మండలం చందనలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు


కోలాటమాడుతున్న మహిళలు


బుక్కరాయసముద్రంలో అలంకరణలో ముసలమ్మ తల్లి

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు, గాజులపల్లి, రజాపురం, బాచుపల్లి, కొజ్జేపల్లి, బసినేపల్లి, గొందిపల్లి తదితర గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. తొండపాడు బొలికొండ రంగనాథస్వామి, బాచుపల్లి బాట సుంకలమ్మ ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి.

పామిడి: మండలవ్యాప్తంగా సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు వేకువజామునే లేచి ఇళ్ళముందు ముగ్గులు వేశారు. ముగ్గులపై గొబ్బెమ్మలు ఉంచి పూజించారు.

బుక్కరాయసముద్రంలో..

బుక్కరాయసముద్రం: మండలంలో సంక్రాంతి సంబరాలు ఎంతో వైభవంగా నిర్వహించారు. ప్రముఖ ఆలయాల్లో సంక్రాంతి, భోగి సందర్భంగా సోమ, మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మండల కేంద్రంలోని తేరుబజార్ వీధిలో ఉన్న వెంకట రమణస్వామి ఆలయంలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ముసలమ్మకట్ట వద్ద వెలసిన కాశీ విశ్వేశ్వర ఆలయంలో మహా శివుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దవడుగూరు: మండల వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దవడుగూరులో పెద్దమ్మ, సుంకులమ్మ దేవతలను ఊరేగించారు. మహిళలు కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఇందులో భాగంగానే రాతిదూలం లాగుడు పోటీలు ఎంతో సందడిగా జరిగాయి. మంగళవారం తెల్లవారు జామున చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాంపురం గ్రామంలో పెద్దమ్మ, సుంకులమ్మతల్లి దేవతలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఏ.తిమ్మాపురం గ్రామంలో మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు.

యల్లనూరు మండలంలో..

యల్లనూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే నిద్రలేచి తలంటు స్నానాలు అచరించి, రంగురంగుల ముగ్గులు వేసి,, ఇళ్ల ముందు గొబ్బెమ్మలు ఉంచి, సాంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకున్నారు. మూడు రోజుల పాటు ప్రజలు సంక్రాంతి పండుగను పిల్లా, పెద్దలు, బంధువులు కలిసి సంతోషంగా గడిపారు.

యాడికి: మండల వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ప్రతి ఇంటి ముందరా రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు ఉంచి పూజలు చేశారు. చిన్నారులు గాలిపటాలు ఎగుర వేసి ఉత్సాహంగా గడిపారు. చందన గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో సోమవారం సాయంత్రం లయన్స్, లియోక్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ జరిగింది.

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో మంగళవారంరాత్రి కనుమ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తుల సమక్షంలో అర్చకులు గోపూజ చేపట్టారు. వస్త్ర ధారణ, ఆహార సమర్పణ చేశారు.


జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్న భక్తులు


చౌడేశ్వరిదేవిని ఊరేగిస్తున్న దృశ్యం


గుత్తి రూరల్: అలంకరణలో రంగనాథుడు


గుంతకల్లు మండలం కసాపురంలో గోపూజను నిర్వహిస్తున్న దృశ్యం


గుత్తిలో శ్రీ లక్ష్మి నరసింహస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


ఇంటి ముంగిట్లో రంగురంగుల ముగ్గులు

క్లుప్తంగా

కోటంక సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ప్రజలు సోమవారం మకర సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం కనుమ పండుగ సందర్భంగా రైతన్నలు పశువులకు పూజలు చేశారు.

అక్షింతల ఊరేగింపు


అక్షింతలను ఊరేగిస్తున్న రామభక్తులు

పెద్దపప్పూరు: అయోధ్యరాముని అక్షింతలను మంగళవారం పెద్దపప్పూరులోని రామకోటి కాలనీలో భజన బృందం సభ్యులు ఊరేగించారు. రాముడి గీతాలను ఆలపిస్తూ గడప గడపకూ తిరిగి అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రతి ఇక్కరూ ఇంటిలోనే స్వామివారి చిత్రపటానికి అక్షింతలు వేసి పూజ చేయాలనే అక్షింతలను పంపిణీ చేస్తున్నట్లు భజన బృందం సభ్యులు తెలిపారు.

రైతు ఆత్మహత్య


గంగిరెడ్డి ఇంద్రసేనారెడ్డి (ఫైల్)

యల్లనూరు: మండలంలోని దంతలపల్లికి చెందిన గంగిరెడ్డి ఇంద్రసేనారెడ్డి అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి సోమవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఇంద్రసేనారెడ్డి ఐదెకరాల పొలంలో పంటలు సాగు చేసి, ఏటా నష్టాలు చవిచూస్తున్నాడు. పెట్టుబడి కోసం రూ.16 లక్షల వరకు అప్పు చేశాడు. తీర్చే మార్గం లేక, తీవ్ర మనస్థాపం చెంది పురుగుల మందును తాగి ఆత్మహత్మ చేసుకున్నాడు. ఎస్ఐ ధరణీ బాబు ఘటనా స్థలానికి చేరుకొని, వివరాలు ఆరాతీశారు. మృతుడికి భార్య రామాంజినమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడు...

యాడికి: అనారోగ్యం కారణంగా ఓ వృద్ధుడు ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని కోన రోడ్డులో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ నాగార్జునరెడ్డి, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. కోన రోడ్డులో నివాసం ఉంటున్న లక్ష్మిశెట్టి నారాయణస్వామి (75)కు భార్య నాగలక్ష్మితో పాటు నాగవేణి, యశోద అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారు ఇంటి వద్దనే ఉంటూ చిన్న కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం చేస్తున్నారు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లి చేసి పంపారు. అయితే నారాయణస్వామి ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మిశెట్టి నారాయణస్వామి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు: మండల కేంద్రమైన పెద్దవడుగూరు సమీపంలో మంగళవారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రాకేష్, సాయి అనే వారికి తీవ్రగాయాలయ్యాయి. పెద్దవడుగూరులో ఉంటున్న రాకేష్ తన తల్లిని గుత్తిలో బస్సుకు ఎక్కించి తిరిగి వస్తున్నాడు. అలాగే ముప్పాలగుత్తికి చెందిన కుందన సాయి గుత్తికి వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. తీవ్రంగా గాయపడిన వారిని పామిడి ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టరు సీజ్

యల్లనూరు: శింగవరం గ్రామ సమీపంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును మంగళవారం ఎస్ఐ ధరణీబాబు సీజ్ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేవని అన్నారు. సీజ్ చేసి భూగర్భగనుల శాఖకు అప్పగిస్తామన్నారు.

రూ.28 లక్షలు పలికిన టెంకాయల వేలం


టెంకాయల వేలం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన వెలసిన బాట సుంకులమ్మ ఆలయంలో మంగళవారం నిర్వహించిన టెంకాయల విక్రయ హక్కు వేలం రూ.28 లక్షలు పలికింది. వన్నేదొడ్డి గ్రామానికి చెందిన మద్దయ్య రూ.28 లక్షలకు టెంకాయల విక్రయ హక్కును దక్కించు కున్నాడు.

తురకపల్లిలో ఊరు జాతర


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్



గుత్తిలో జగన్ ఐటీ ఆర్మీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

గుత్తి రూరల్: మండలంలోని తురకపల్లిలో మంగళవారం ఊరు జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరై పెద్దమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని కార్యకర్తలను పలకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ విశాలాక్షి, సర్పంచ్ సుందరమ్మ, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, లక్ష్మిరెడ్డి హనుమంతురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రంగస్వామి రెడ్డి పాల్గొన్నారు.

సుంకులమ్మ ఆలయానికి విరాళం

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లు రాగిమానుకట్ట వీధికి చెందిన సుంకులమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.20 వేల విరాళం అందజేశారు. మంగళవారం తన నివాసంలో కలసిన ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే చెక్కును ఇచ్చారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ ఐటీ ఆర్మీ పోస్టర్ల ఆవిష్కరణ

గుత్తి: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన జగన్ ఐటీ ఆర్మీ పోస్టర్లను గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐటీ ఉద్యోగులు జగన్ ఐటీ ఆర్మీలో పేర్లను ఎన్‌రోల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, పట్టణ, మండల సచివాయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి మల్లికార్జున, మాజీ జెడ్పీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జేసీ సోదరులు చేసిన అభివృద్ధి శూన్యం

- వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నెరాజు


మాట్లాడుతున్న వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు

తాడిపత్రి: '40 ఏళ్ల కాలంలో జేసీ సోదరులుగా తాడిపత్రి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదు. కేవలం వారి స్వార్థం కోసం చేపట్టిన పనులు తప్ప ప్రజలకు మేలు జరిగే అభివృద్ధి కార్యక్రమాలు ఏమీ చేయలేదు' అని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నెరాజు అన్నారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాలనలో అభివృద్ధి పనులు ఏమీ జరగలేదని ప్రతిపక్ష టీడీపీ నాయకులు సామాజిక మాధ్యమాల్లో వారి అనుచరుల ద్వారా అసత్య ప్రచారం చేయించడం సరికాదన్నారు. అదే విధంగా సజ్జలదిన్నె పంచాయతీ అభివృద్ధిపై నానా రభస చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఎమ్మెల్యేగా జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా జేసీ దివాకర్‌రెడ్డి పనిచేసినా కనీసం వారి సొంత మండలమైన పెద్దపప్పూరు, స్వగ్రామమైన జూటూరుకు కూడా ఏమీ చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ఏం అభివృద్ధి చేశారో సామాజిక మాధ్యమాల ద్వారానే ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సజ్జలదిన్నె లేఅవుట్‌లో ప్రజలకు ఉచితంగా ఇంటి స్థలాలు ఇస్తే కోర్టుకు వెళ్లి ఆపాలని ప్రయత్నించినదెవరో అందరికీ తెలుసన్నారు. సంక్షేమ పథకాలను ఇంటి ముందరకే చేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగనేనన్నారు. నియోజకవర్గంలో జగనన్న కాలనీ లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయించిన ఘనత ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిదేనన్నారు. బెటాలియన్ కోసం గ్రామానికి చెందిన సాంబశివారెడ్డి అనే వ్యక్తి దాదాపు 4 ఎకరాలు దానంగా ఇస్తే దాన్ని స్వంతానికి రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఘనులెవరో చెప్పండి జేసీ అని ప్రశ్నించారు. బీసీ నాయకుడిని కాబట్టే తన రాజకీయ ఎదుగదలను ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. చిల్లర రాజకీయాలు మానుకుంటే జేసీ ప్రభాకర్‌రెడ్డికి మంచిదని సూచించారు. మీరు చేసిన పాపాలే అమాయకుడైన నీ కుమారుడిని చుట్టుముడుతాయి జాగ్రత్తగా అని హెచ్చరించారు.

కమనీయం... గోదాదేవి కల్యాణం


గోదాదేవి కల్యాణ క్రతువు జరిపిస్తున్న అర్చకులు


గుత్తిలో కల్యాణోత్సవం జరుపుతున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో వెంకటేశ్వరస్వామి, గోదాదేవి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కొలువుదీర్చారు. అర్చకులు మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కళ్యాణాన్ని వైభవంగా జరిపించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుత్తి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో మంగళవారం రాత్రి గోదాదేవి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు వాసు దేవ శర్మ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి సమక్షంలో కల్యాణోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిషోర్ బాబు, వాసవీ మహిళా మండల అధ్యక్ష, కార్యదర్శులు రాచమడుగు ఉమాదేవి, భాగ్యలక్ష్మి, కోశాధికారిణి కృష్ణవేణి, భక్తులు పాల్గొన్నారు.

నేడు 26 వార్డులో ఎమ్మెల్యే పర్యటన

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని 26వ వార్డులో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి బుధవారం పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. 26వ వార్డులోని వైఎస్సార్ ఫంక్షన్ హాలు నుంచి ఎమ్మెల్యే పర్యటన ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి నియోజకవర్గంలోని పెద్దవడుగూరు మండల కేంద్రంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పర్యటిస్తారని తెలిపారు. స్థానిక చేనేత కాలనీ నుంచి పర్యటన ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఘనంగా గ్రామ దేవర


దేవర కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి

పామిడి: మండలంలోని సొరకాయలపేటలో మంగళవారం గ్రామ దేవర ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అల్లుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సీబీ మంజునాథ్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించాఉరు. ఈసందర్భంగా ఆయన గ్రామస్తులతో పార్టీ స్థితిగతులపై సమీక్షించారు. గుంతకల్లు సీపీఎం నియోజకవర్గ నేత శ్రీనివాసులు ఆహ్వానం మేరకు గ్రామంలోని ఆయన ఇంటికి వెళ్లి భోజనం చేశారు.

బాధితునికి ఆర్థిక సాయం


బాధితులకు నగదు అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: ఇటీవలే పట్టణంలోని పాత ఈద్గా సమీపంలో బాబా అనే వ్యక్తికి చెందిన గుడిసెకు నిప్పంటుకొని అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, హెచ్ఎస్ఎస్ ట్రస్టు వ్యవస్థాపకులు హీరాపురం గయాజ్‌బాషా కాలిపోయిన ఇంటిని మంగళవారం పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థికసాయం చేశారు.

ఆటో అపహరణకు విఫలయత్నం

గుత్తి: పట్టణంలో సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో శివ అనే వ్యక్తికి చెందిన ఆటోను ఓ గుర్తు తెలియని వ్యక్తి అపహరించడానికి విఫలయత్నం చేశాడు. వివరాలు..స్థానిక రాయల్ సినిమా థియేటర్ ఏరియాలో నివాసముండే చికెన్ బండి నిర్వాహకుడు శివ తన ఆటోను రఘురామిరెడ్డి కాంప్లెక్స్ వద్ద ఉంచాడు. అయితే ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆటోను చోరీ చేసుకెళుతున్న సమయంలో ఆటో యజమాని స్థానికుల సాయంతో వెంటపడ్డాడు. దీంతో ఆ దొంగ ఆటోను వదిలేసి పరారయ్యాడు. తర్వాత పోలీసులు దొంగను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు యాడికి సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. యాడికి గ్రామ శివారులో గత కొంత కాలంగా పేకాట ఆడుతున్నారని పక్కాగా వచ్చిన సమాచారం మేరకు మంగళవారం ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారని చెప్పారు. మండల కేంద్రానికి చెందిన ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.6,150 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రాతి కట్టడంతో ఆలయాల నిర్మాణానికి కృషి

- దేవదాయ,ధర్మదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్


యర్రగుంట్లలో ఆలయ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జ్వాలాపురం శ్రీకాంత్

గార్లదిన్నె: దేవదాయ,ధర్మదాయశాఖ నిధులు మంజూరు చేయించి, రాతి కట్టడంతో ఆలయాల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు దేవదాయ,ధర్మదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ పేర్కొన్నారు. యర్రగుంట్లలో హిందూ ధర్మాలు పాటించి, రాతి కట్టడాలతో ఆలయాలు నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా యర్రగుంట్లలో నిర్మాణంలో ఉన్న రాతి కట్టడాలతో ఆలయాలు నిర్మిస్తుండడంతో నిర్మాణ పనులను జ్వాలాపురం శ్రీకాంత్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోతున్న తరుణంలో గ్రామంలో ప్రజలందరూ ఐకమత్యంతో హిందూ మత ధర్మలు పాటించి, ఆంజనేయ స్వామి, శివాలయం,వేణుగోపాలస్వామి ఆలయాలు రాతి కట్టడంతో నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.కోటి వెచ్చించి, ఆలయ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. ఆలయ నిర్మాణానికి దేవదాయశాఖ నుంచి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరడంతో గ్రామంలో ఆలయ నిర్మాణ పనులు పరిశీలించామన్నారు. గ్రామంలో హిందూధర్మాలు పాటిస్తున్నందున దేవదాయ శాఖ కమిషనర్‌కు వివరించి లేఖ రాశానని, త్వరలో నిధులు మంజూరు చేయించి, ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఆలయాలు అభివృద్ధికి, ఆలయంలో విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. అనంతపురంలో దాదాపు 20 దేవాలయాలకు నిధులు మంజూరు కాగా, గార్లదిన్నెలో శిరివరం, రూ.60 లక్షలు, బుక్కరాయ సముద్రంలో రూ.70 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు శాంతప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు రవిచంద్రరెడ్డి, రుషీశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,శివారెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి


మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

తాడిపత్రి అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని, ప్రమాదాలు జరిగినప్పుడు విధిగా సహకారం అందించి ప్రాణాలు కాపాడాలని డీఎస్పీ సీఎం.గంగయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజీలో డీఎం శంకర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. డీఎస్పీ గంగయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వాహనాల వేగం నియంత్రించడం కోసం జిల్లాలోని జాతీయ రహదారిపై స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రామలక్ష్మి రోడ్డు భద్రత, ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ నందినీ, డిపో సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.


అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంతకల్లు: పట్టణంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1994–99 బ్యాచ్ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత కలుసుకుని, ఆనాటి జ్ఞాపకాలను నేమరవేసుకుని ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మస్తానయ్య, నాయుడు, నారాయణస్వామి, వీరభద్ర, రాముడు, మల్లికలను సత్కరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846